సాక్షి బాపట్ల

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



జగనన్నకు అండగా నిలుస్తాం


ఫిరంగిపురం: తక్కెళ్లపాడుకి చెందిన 11 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తామని తెలిపారు.



వైభవంగా విగ్రహ ప్రతిష్ట

భట్టిప్రోలు: గొరిగపూడి పంచాయతీ పెదవరి కూటివారిపాలెంలో నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

రేపు వీరాంజనేయస్వామి తిరునాళ్ల



వినుకొండటౌన్: మద మంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్లను ఆదివారం నిర్వహిస్తున్నట్లు, ఆలయ ప్రధాన అర్చకుడు ఎం.రాఘవేంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆకు పూజ, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు 'పాలిసెట్-2024'

గుంటూరు, తెనాలిలో 14 పరీక్ష కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై శనివారం పాలిసెట్-2024 జరగనుంది. గుంటూరు నగరంతో పాటు తెనాలిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు నగర పరిధిలోని 11 కేంద్రాల్లో 4,628 మంది విద్యార్థులతో పాటు తెనాలిలోని మూడు కేంద్రాల్లో మరో 800 మంది చొప్పున హాజరు కానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్, బాల్ పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ తమ వెంట తీసుకుని వెళ్లాలని, ఇవి మినహా సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ వంటి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని పాలిసెట్-2024 గుంటూరు జిల్లా సమన్వయ కర్త తాళ్లూరి శేఖర్ పేర్కొన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించబోమని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సేవలతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

అనుక్షణం అప్రమత్తత అవసరం



నగరంపాలెం: అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలకులు సత్యార్థ్ అనిరుద్ పంకజ్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శుక్రవారం జిల్లాలోని నడింపాలెం, నారాకోడూరు, పొన్నూరులోని మంచాల చెక్‌పోస్ట్‌ల వద్ద ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా చెక్‌పోస్ట్‌ల్లో విధులు నిర్వర్తించే అధికార, సిబ్బందితో ఆయన మాట్లాడారు. చెక్‌పోస్ట్‌ల వద్ద అనుసరించాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఐటీ కోర్ సోషల్ మీడియా సీఐ మౌలా షరీఫ్ తదితరులు ఉన్నారు.

యార్డులో 62,153 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 59,655 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 62,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,701 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఎన్నికల్లో భాగస్వామ్యం కావాలి



నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో స్వచ్ఛందంగా ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనాలని ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ కళాశాలల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులలో పాల్గొనే ఎన్.సి.సి క్యాడేట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పోస్టల్ బ్యాలెట్ వసతిని కల్పించామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో కె.వినాయకం, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్.రాఘవేంద్ర, వివిధ కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.8600, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.

పచ్చ పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్

- చోటా, మోటా నేతలకు డబ్బులు ఎర
- వైఎస్సార్ సీపీలో చురుగ్గా ఉన్న నేతలే లక్ష్యం
- స్థాయిని బట్టి ధరలు
- రేపల్లె, వేమూరు, పర్చూరు, అద్దంకి నేతలకు ప్రలోభాలు
- బాపట్ల ,చీరాలల్లోనూ ఇదే తీరు
- ఓటర్ల మద్దతు కోల్పోయి నేతలకు వల
- పచ్చపార్టీ తీరును చీకొడుతున్న జనం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఓటర్ల మద్దతు కూడగట్టలేక పచ్చ పార్టీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతోంది. ప్రజాబలం అధికారపార్టీ వైపు ఉందన్న విషయం నిర్ధారించుకున్న పచ్చ పార్టీ అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. ఓటర్ల సంగతి పక్కన బెట్టి ముందు గ్రామాల్లో పాగా వేసేందుకు అధికారపార్టీకి చెందిన చోటామోటా నేతలపై దృష్టి సారించారు. ఎన్నికల్లో తమకు సహకరిస్తే భారీగా డబ్బులు ముట్టజెప్పుతామంటూ పచ్చ నేతలు ఆశ చూపుతున్నారు. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన గ్రామ పంచాయతీ, మండలస్థాయి నేతలు టార్గెట్‌గా టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. ఆ స్థాయి నేతలకు రేట్లు ఫిక్స్ చేసి రాయబారాలు పంపిస్తున్నారు. అయితే, వాటికి స్పందన పెద్దగా కనిపించడంలేదు. ఒకరిద్దరు లొంగినా.. ఎక్కువమంది తిప్పికొడుతున్నారు. ఆఫర్లతో వచ్చిన వారిని కొందరు చివాట్లు పెడుతున్నారు. దీంతో పచ్చపార్టీ నేతల ఎత్తులు సాగడంలేదు. పైపెచ్చు ప్రజాభీష్టానికి భిన్నంగా పార్టీ మారినా, జనం సంగతి దేవుడెరుగు వారి అనుచరులే వెన్నంటి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో డబ్బుల కోసం ఆశ పడి పార్టీ మారితే గ్రామాల్లో ఉన్న కాస్తా పలుకుబడి, పరువు మంటగలిసే పరిస్థితులు నెలకొనడంతో అధికారపార్టీ నేతలు ముందుకు రావడం లేదు. పచ్చపార్టీ నేతలు ఓట్లను కొనుగోలు చేసేందుకు కుట్రలు చేస్తుండటంతో జనం వారిని చివాట్లు పెడుతున్నారు.

బాపట్లలో ప్రజల నుంచి వ్యతిరేకత

టీడీపీ నేతల ప్రలోభాలు రేపల్లె, వేమూరు, అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో ఎక్కువ ఉన్నాయి. బాపట్లలోనూ అధికార పార్టీ నేతల్ని కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యత నిస్తున్నారు. ఇది తెలిసి జనం వారిని ఛీ కొడుతున్నారు. బాపట్ల నియోజకవర్గంలో ఇటీవల ఒక మండలస్థాయి ప్రజాప్రతినిధి పచ్చపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సదరు నేతను టీడీపీ నేత భారీ మొత్తంలో కొనుగోలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఇది తెలుసుకున్న అతడి అనుచరులు, ఓట్లేసిన ప్రజలు చివాట్లు పెట్టారు. దీంతో అతనికి అంత మొత్తం చెల్లించి కొనుగోలు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని పచ్చనేత వాపోతున్నారు.

రేపల్లెలో రకరకాల రేట్లు

పచ్చనేతల డబ్బులకు లొంగితే జనంతో తిట్లు తిని ఉన్న కాస్తా పరువు పోగొట్టుకోవాల్సి వస్తుందని కొందరు నేతలు బెంబేలెత్తి పోతున్నారు. రేపల్లె నియోజకవర్గంలో పచ్చ పార్టీ నేత జనం మద్దతు కూడగట్టడం సంగతి పక్కన బెట్టి చోటా మోటా నేతల కొనుగోలుకు ప్రాధాన్యత నిస్తున్నారు. ఇప్పటికే పట్టణంలో పార్టీ మారిన ముగ్గురు కౌన్సిలర్లకు పచ్చనేత స్థాయిని బట్టి రూ. లక్షల్లో చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది బయటకు పొక్కడంతో అనుచరులు, వార్డు ఓటర్లనుంచి సదరు కౌన్సిలర్లు తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వచ్చింది. పార్టీ ఫిరాయిస్తే సర్పంచులకు ఒక రేటు, మాజీ సర్పంచులకు ఒక రేటు, మండల స్థాయి పదవులున్న నేతలకు పెద్ద మొత్తంలో పచ్చనేత రేట్లు ఫిక్స్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

వేమూరులో తీవ్ర వ్యతిరేకత

వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలంలోని ఒక గ్రామపంచాయతీకి చెందిన అధికారపార్టీ నేత ఈ మధ్యకాలంలో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడు. ఆయన పచ్చపార్టీ నేత నుంచి భారీ మొత్తంలో నగదు పుచ్చుకున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. దీంతో అనుచరులతో పాటు అక్కడి జనంలో తీవ్ర వ్యతిరేకత చోటుచేసుకుంది. చివరకు సదరు నేత ఒంటరిగా మిగిలారు. పచ్చ పార్టీ డబ్బులకు అమ్ముడు పోయి ఉన్న పరువు పోగొట్టుకున్నామని కుటుంబ సభ్యులే అతడ్ని చీదరించుకునే పరిస్థితి నెలకొంది.

చీరాలలో ఆఫర్లు

చీరాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత అధికార పార్టీతో పాటు టీడీపీ నేతల్ని కొనుగోలు చేసేందుకు ఆఫర్లు ప్రకటిస్తున్నారు. అయితే, డబ్బులకు ఆశపడి సదరు నేతతో వెళితే రెంటికిచెడ్డ రేవడి అవుతామని ఒక్కరూ వెళ్లడం లేదు.



అద్దంకిలో వ్రతం చెడ్డా దక్కని ఫలితం

అద్దంకి నియోజకవర్గంలో పచ్చ పార్టీ నేత అధికారపార్టీ నేతల కొనుగోళ్లకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అద్దంకికి చెందిన ఒక బీసీ నేత అధికారపార్టీ వీడి పచ్చపార్టీలో చేరారు. డబ్బులకు ఆశపడి సదరు నేత పార్టీ ఫిరాయించారని జోరుగా ప్రచారం జరిగింది. దీంతో సొంత అనుచరులే అతడ్ని నిలదీసి పరువు బజారుకీడ్చారు. దీంతో వ్రతం చెడ్డా ఫలితం దక్కక పోవడంతో సదరు బీసీ నేత లబోదిబో మంటున్నారు. ఈ నియోజకవర్గంలో అధికారపార్టీ నేతలను పచ్చనేత పెద్ద ఎత్తున ప్రలోభ పెడుతున్నట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి నేతలకు పలుకుబడిని ఇస్తామని ప్రలోభ పెడుతున్నారు. సంతమాగులూరు, జే.పంగులూరు మండలాలకు చెందిన అధికార పార్టీ నేతలకు పచ్చపార్టీ గాలాలు వేస్తోంది. దీంతో ఒకరిద్దరు ప్రలోభాలకు లొంగి అభాసు పాలు కావడంతో పచ్చపార్టీ వైపు మొగ్గేందుకు అధికారపార్టీ నేతలు మొగ్గు చూపటంలేదు.

29న సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభ

- పొన్నూరు అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాట్లు
- సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి



ఏర్పాట్లపై చర్చిస్తున్న కిలారి రోశయ్య, తలశిల, లేళ్ల అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 29వ తేదీన పొన్నూరుకు రానున్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సీఎం సభ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణలు శుక్రవారం పరిశీలించారు. 29న మధ్యాహ్నం 3 గంటలకు అంబేద్కర్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తలశిల రఘురాం విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాల్గొనే బహిరంగ సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ ప్రజలను పలకరించేందుకు సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 29న వస్తున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

వెన్నుపోటుదారుల మాటలు నమ్మొద్దు

- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి
- సమష్టిగా పనిచేసి పానెం చిన హనిమిరెడ్డి, నందిగం సురేష్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి. వేదికపై అయోధ్య రామిరెడ్డి, పానెం చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: 'పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారికి స్థానం లేదని, వారి మాటలు నమ్మొద్దని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రేణింగవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అధ్యక్షతన కొరిశపాడు, జే.పంగులూరు మండలాలలోని గ్రామాల నాయకులు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎల్లో మీడియాలో వచ్చేవన్నీ అసత్యాలనే కొట్టిపారేశారు. 2024 ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వేవ్ ఎక్కువగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికీ అందాలంటే జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇచ్ఛాపురంతో సిద్ధం సభలు పూర్తయ్యాయని, రాష్ట్ర ప్రజల నుంచి విశేష స్పందన కనిపించిందని వెల్లడించారు. దీన్ని బట్టి రాష్ట్రంలో 175కు175, 25కి25 ఎంపీ స్థానాలు సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 175 ఎమ్మెల్యే సీట్లలో మొట్టమొదటి నియోజకవర్గం నుంచి గెలిచి జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలకు రూ. 2.75 లక్షల కోట్లు లబ్ధిదారులు ఖాతాలో జమయ్యాయని చెప్పారు. అతి కొద్ది కాలంలో నియోజకవర్గంలో పానెం చిన హనిమిరెడ్డిని ఎంతో నమ్మకం ఏర్పరచుకున్నాడని అభినందించారు. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలతో వలంటరీ వ్యవస్థ తీసేస్తానని చెబుతున్నాడని తెలిపారు. 2014లో కూటమి అబద్ధపు 200 పైగా హామీలతో ముందుకు వచ్చిందని, తిరిగి మళ్లీ వాటితోనేఏ ముందుకు వస్తున్నారని గుర్తు చేశారు. వీటన్నింటిని నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, బూత్ కమిటీ మెంబర్లు తిప్పికొట్టి ప్రజలకు తెలియజెప్పాలని వై.వి. సుబ్బారెడ్డి చెప్పారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేసి అద్దంకి నుంచి హనిమిరెడ్డిని, ఎంపీ సురేష్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



హాజరైన మండలాల నాయకులు

చంద్రబాబు మాటల మోసకారి

జిల్లా కోఆర్డినేటర్, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మీద పేద, బడుగు, బలహీనవర్గాలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి ఆయన వందకు వంద శాతం హామీల్ని నెరవేర్చారని వివరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీల్లో 100కు 20 శాతం కూడా నెరవేర్చలేక పోయాడని గుర్తు చేశారు. హనిమిరెడ్డిని అద్దంకి నుంచి పోటీ చేయాలని అధిష్టానం చెప్పిన వెంటనే వేరే ఆలోచన లేకుండా ఇక్కడకు వచ్చారని తెలిపారు. అర్జునుడుకి శ్రీకృష్ణుడు ధైర్యంగా ఉంటే హనిమిరెడ్డికి వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి వేవ్ నడుస్తోందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన మంచి తెలియజేసి హనిమిరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఎల్లో మీడియా రోత రాతలు

పానెం చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో గెలిపిస్తే తిరిగి వైఎస్సార్ సీపీలోకి వెళ్తానని గొట్టిపాటి చెబుతున్నాడని, ఆయనకు జగనన్న పార్టీలో స్థానం కల్పించడని తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి పదవులు, మంచి సముచిత స్థానం కల్పిస్తాడని చెప్పారు. తాను నియోజకవర్గంలో ఒక్క రోజు కనిపించకపోతే ఎల్లో మీడియా పిచ్చిరాతలు రాస్తోందని మండిపడ్డారు. మొదటిలో తాను ఇలాంటి రాతలు రాస్తున్నారేంటని బాధపడేవాడినని, ఇప్పుడు రాస్తే నవ్వు వస్తోందని తెలిపారు. అద్దంకిలో ఇల్లు కట్టుకొని ఇక్కడే ఉంటానని వెల్లడించారు. అనంతరం కొరిశపాడు, పంగులూరు మండలాల్లో గ్రామాల వారీగా నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో ముందుగా బొల్లాపల్లి టోల్‌ప్లాజా నుంచి వై.వి. సుబ్బారెడ్డికి, అయోధ్య రామిరెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతు రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, జంపాని రవిబాబు, రాష్ట్ర వడ్డేర కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, ఎస్సీ సెల్ కన్వీనర్ బుజ్జి, బీసీ సెల్ కన్వీనర్ భాస్కర్‌రాజు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల నేపథ్యంలో డివిజన్ మీదుగా పలు రైళ్లను రద్దు చేయడం జరిగిందని శుక్రవారం డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ వెల్లడించారు. గుంటూరు - సికింద్రాబాద్(12705), సికింద్రాబాద్ - గుంటూరు(12706), గుంటూరు - సికింద్రాబాద్(17201), సికింద్రాబాద్ - గుంటూరు(17202) రైళ్లు ఈనెల 29 నుంచి మే 10వ తేదీ వరకు, అలాగే మే 16 నుంచి మే 22వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. తిరుపతి - సికింద్రాబాద్(07481) రైలు ఈనెల 28వ తేదీ, మే 5, మే 12, 19 తేదీల్లో రద్దు చేయడం జరిగిందన్నారు. సికింద్రాబాద్ - తిరుపతి(07482)రైలు ఈనెల 29, మే 6, మే 13, మే 20 తేదీల్లో రద్దు చేయడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ - నర్సాపూర్(07631) మే 4, 11, 18 తేదీల్లో, నర్సాపూర్ - హైదరాబాద్(07632) రైలు మే 5, 12, 19 తేదీల్లో రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- పెండింగ్‌లో చీరాల కాంగ్రెస్ అభ్యర్థి 'ఆమంచి' నామినేషన్
- బకాయిలు చెల్లించకపోవడంతో ఆపిన అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పరిశీలన ఘట్టం శుక్రవారం ముగిసింది. ఈనెల 18 నుంచి 25 వరకు జరిగిన కార్యక్రమంలో బాపట్ల రిజర్వ్‌డ్ పార్లమెంట్ స్థానానికి 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం జరిగిన పరిశీలనలో ముగ్గురు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 17మంది పోటీలో ఉన్నారు. తిరస్కరణకు గురైన వారిలో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఎవరూ లేరు.

- జిల్లాలోని పర్చూరు, అద్దంకి, చీరాల, బాపట్ల రేపల్లె, వేమూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 130 మంది నామినేషన్లు వేశారు. పరిశీలన అనంతరం 23 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాలుగింటిని అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతానికి 103 మంది పోటీలో మిగిలారు.
- చీరాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్, ఆయన సతీమణితోపాటు మరో ఇద్దరు నామినేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వానికి బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

అసెంబ్లీ నామినేషన్ల వివరాలు

నియోజక వర్గంపేరు	నామినేషన్లు వేసినఅభ్యర్థులు	ఆమోదం పొందినవి	తిరస్కరణ గురైనవి	పెండింగ్‌లో ఉన్నవి
పర్చూరు	20	17	03	---
చీరాల	23	15	05	03
అద్దంకి	21	15	06	---
రేపల్లె	18	15	03	---
వేమూరు	17	16	01	--
బాపట్ల	31	25	05	01
మొత్తం	130	103	23	04
బాపట్ల పార్లమెంట్	20	17	03	

అటు మోదం.. ఇటు ఖేదం

- టీడీపీ నామినేషన్లకు మొక్కుబడిగా జనం
- అద్దంకి, బాపట్ల, పర్చూరు నామినేషన్లలో కానరాని ప్రజలు
- వేమూరు, చీరాల, రేపల్లెలోనూ ఇదే పరిస్థితి
- డబ్బు, మద్యం, బిర్యానీ పాకెట్లు పంచినా స్పందన కరువు



వేమూరులో జనం లేక వెలవెలపోయిన టీడీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో అధికార పార్టీ అభ్యర్థుల నామినేషన్లకు జనం పోటెత్తగా.. పచ్చపార్టీ అభ్యర్థులకు మాత్రం జనం కరువయ్యారు. డబ్బులు, మద్యం, బిర్యాని పాకెట్లు పంపిణీ చేసినా ఫలితం లేకపోయింది. ప్రజల నుంచి స్పందన కరువవ్వడంతో ర్యాలీలు వెలవెలపోయాయి. జిల్లాలో ఇప్పటివరకూ అద్దంకి, పర్చూరు, బాపట్ల, రేపల్లె, వేమూరు, చీరాలలో పచ్చపార్టీ అభ్యర్థుల నామినేషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలకు అన్ని నియోజకవర్గాల్లో మూడువేల నుంచి పదివేల లోపు మాత్రమే జనం హాజరయ్యారు. వేమూరులో టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబు నామినేషన్‌కు పట్టుమని మూడువేల మంది కూడా హాజరుకాలేదు. బాపట్ల, చీరాలల్లోనూ ఇదే పరిస్థితి. ఇక టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న అద్దంకి, పర్చూరు, రేపల్లె నియోజకవర్గాల్లో పట్టుమని ఎనిమిది వేలకు మించి జనం రాలేదు. ర్యాలీలకు జనాన్ని తరలించేందుకు పచ్చనేతలు నానా తంటాలు పడ్డారు. ఒక్కొక్కరికీ రూ. 300 నుంచి రూ.500తో పాటు మద్యం బాటిళ్లు, బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. జనం తరలింపునకు వాహనాలు ఏర్పాటు చేశారు. గ్రామస్థాయి నాయకుల చేయి తడిపినా ఫలితం లేకపోయింది. బాపట్ల నియోజకవర్గం నుంచి జనం రాకపోవడంతో టీడీపీ అభ్యర్థి వేగేశన చీరాల నియోజకవర్గ పరిధిలోని గ్రామాలనుంచి కూలీ ఇచ్చి జనాన్ని తరలించారు. మిగిలిన అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

అధికార పార్టీ వైపు జనం

జిల్లా వ్యాప్తంగా అధికారపార్టీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాలకు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో నామినేషన్లు పండుగ వాతావరణంలో జరిగాయి. నియోజకవర్గ కేంద్రాలు జనసంద్రంగా మారాయి. అభ్యర్థుల్లో రెట్టించిన ఉత్సాహం నెలకొంది. చీరాల ,అద్దంకి, బాపట్ల,పర్చూరు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ అభ్యర్థుల నామినేషన్లకు 25 వేలనుంచి 35 వేలకు తగ్గకుండా జనం తరలివచ్చారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల నామినేషన్లలోనూ ఏమాత్రం తగ్గకుండా జనం హాజరయ్యారు. పైగా డబ్బులు, మద్యం లేకుండా జనం తరలిరావడం గమనార్హం.

క్లుప్తంగా

11 నామినేషన్ల తిరస్కరణ
అద్దంకిలో 15 మంది నామినేషన్ల ఆమోదం

అద్దంకి: నామినేషన్ల పర్వం ఈనెల 25తో ముగిసింది. ఈమేరకు శుక్రవారం అధికారులు అభ్యర్థుల నామపత్రాలను పరిశీలించారు. నియోజకవర్గంలో వివిధ పార్టీల తరపున 21 మంది 36 నామినేషన్లు వేశారు. కాగా అందులో ఆరుగురికి చెందిన 11 నామినేషన్లు సక్రమంగా లేకపోవడంతో తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ, కాంగ్రెస్ తో కలుపుకుని 15 మంది వేసిన 25 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి సునీల్ ధ్రువీకరించారు.

చీరాలలో ఐదు నామినేషన్ల తిరస్కరణ
ఆమోదం 15, పెండింగ్‌లో 3

చీరాల టౌన్: చీరాల అసెంబ్లీ అభ్యర్థిత్వ నామినేషన్ పత్రాల పరిశీలన స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణ రెడ్డి నేతృత్వంలో జరిగింది. మొత్తం 23 మంది అభ్యర్థులు 39 నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో వైఎస్సార్ సీపీ తరపున కరణం వెంకటేశ్ తోపాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల 15 నామినేషన్లను ఆమోదించారు. కాగా పలు కారణాలతో ఐదింటిని తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆమంచి కృష్ణమోహన్, ఆమంచి సుజాత, జంజనం కృష్ణలకు చెందిన నామినేషన్ల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం పొందుపర్చడంతో వాటిని పెండింగ్‌లో ఉంచినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. కాగా ఈనెల 27 మధ్యాహ్ననికల్లా నామినేషన్ల పరిశీలన పూర్తవుతుంది.

గుంటూరు డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు
సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పలు అభివృద్ధి పనులు చేపట్టిన నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం వెల్లడించారు. రైలు నంబర్ 07783 విజయవాడ– గుంటూరు, 07788 గుంటూరు– విజయవాడ, 07276 కాచిగూడ– మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ– నడికుడి రైలు ఈ నెల 29వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. 07973 నడికుడి - మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ– నడికుడి రైళ్లు ఈనెల 30వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని చెప్పారు. 07791 కాచిగూడ– నడికుడి, 07792 నడికుడి– కాచిగూడ రైలు మే ఒకటో తేదీ నుంచి మే 31వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు. రైలు నంబర్ 07779 గుంటూరు– మాచర్ల మీదుగా ప్రయాణించాల్సిన రైలును తాత్కాలిక రద్దు చేస్తూ ఈ రైలు గుంటూరు– నడికుడి మీదుగా ప్రయాణిస్తుందని, 07780 రైలు మాచర్ల– గుంటూరు మీదుగా ఈనెల 29వ తేదీ నుంచి మే 22 వరకు నడికుడి– గుంటూరు మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ప్రయాణికులు గమనించి సురక్షితమైన ప్రయాణం చేయాల్సిందిగా కోరారు.

సీఎం జగన్‌తోనే జన సంక్షేమం




సంతమాగులూరు రోడ్ షోలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, రథంపై ఆయోధ్య రామిరెడ్డి, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

- సంతమాగులూరులో రోడ్ షో
- పాల్గొన్న రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి
- బుల్లెట్ నడిపిన చిన హనిమిరెడ్డి

బల్లికురవ: రాష్ట్రంలోని ప్రజలందరికి సంక్షేమ పథకాలతో పాటు పేదల జీవితాల్లో వెలుగులు నింపాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేయాలని రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి అద్దంకి నుంచి కొమ్మాలపాడు, ఏల్చూరు, పుట్టావారిపాలెం అడ్డరోడ్ మీదుగా సంత మాగులూరు వరకు రోడ్ షో సాగింది. పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో జనం కష్టాలు తెలుసుకుని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నవరత్నాల ద్వారా ఇంటింటికి అందించిన ఘనత జగన్‌దేనన్నారు. మీ ఇంట్లో మేలు జరిగితేనే ఓటు వేయండని చెప్పిన



రోడ్ షోలో బుల్లెట్ నడిపిన అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

నాయకులు ఎక్కడైనా ఉన్నారా? అని అడిగారు. ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీతో పొత్తు పెట్టుకుని సూపర్ సిక్స్ పథకాల పేరుతో ముందుకువస్తున్నారన్నారు. వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. యువకుడు ఉత్సాహవంతుడైన హనిమిరెడ్డికి అద్దంకి బాధ్యతలు అప్పగించారని అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారన్నారు. అసెంబ్లీ తరపున హనిమిరెడ్డికి ఒక ఓటు, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్ కు మరో ఓటు మేర ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్‌నొక్కి ఆశీర్వదించాలన్నారు. ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే నెంబర్‌వన్ సీఎంగా గుర్తింపు పొందారన్నారు. సంక్షేమ పథకాలు తిరిగి అందాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రోడ్‌షోలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల నుంచి నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. అంతకుముందు అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి బుల్లెట్ నడిపి యువతలో ఉత్సాహం నింపారు. రోడ్ షోలో అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, వైద్యుడు కారసాని శ్రీనివాసరెడ్డి తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- ల్యాప్‌ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- జీఆర్పీ సీఐ వెంకటేశ్వర్లు వెల్లడి

లక్ష్మీపురం: రైళ్లలో ప్రయాణికుల నుంచి ల్యాప్ ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌లు చోరీలకు పాల్పడే వ్యక్తిని అరెస్ట్ చేసి, రూ.4 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీ సీఐ గంగావెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా తెనాలి, బాలాజీరావుపేట ప్రాంతానికి చెందిన గాజుల సురేష్ సినిమా పరిశ్రమలో పని చేస్తుండేవాడు. చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. భార్య కూడా వదిలేసింది. రైళ్లలో చోరీలకు పాల్పడడం అలవాటు పడ్డాడు. సెల్‌ఫోన్‌లు, ల్యాప్ ట్యాబ్‌లు అపహరించి వాటిని అమ్ముకుని సొమ్ముచేసుకునే వాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంలో జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేస్తుండగా తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. విచారణ చేయగా సెల్‌ఫోన్‌లు, ల్యాప్ ట్యాబ్‌లు చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. అతడి బ్యాగ్‌ను పరిశీలించారు. బ్యాగ్‌లో ఆరు సెల్ ఫోన్లు, 4 ల్యాప్ ట్యాప్‌లు, ఒక స్మార్ట్ వాచ్



చోరీ చేసిన సొత్తు, నిందుతుడిని అరెస్ట్ చేసిన జీఆర్పి సిఐ గంగావెంకటేశ్వర్లు, పక్కన ఎస్సైలు

దొరికాయి. దీంతో జీఆర్పీ పోలీసులు సురేష్‌పై కేసు నమోదు చేసి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, ల్యాప్ ట్యాబ్‌లను స్వాధీనం చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో సహకరించిన జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి, ఆర్పీఎఫ్ ఎస్ఐ డి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఖాదర్ బాషా సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవి కాలంలో రైళ్లలో ప్రయాణికులు వేమరపాటుగా ఉంటే విలువైన వస్తువులు చోరీకి గురవుతాయని, ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు.

మే 4, 5 తేదీల్లో రాష్ట్ర క్యారమ్స్ టోర్నీ

గుంటూరు వెస్ట్(క్రీడలు): వచ్చే నెల 4, 5 తేదీల్లో రాష్ట్ర ప్రథమ ర్యాకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆంధ్ర స్టేట్ క్యారమ్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 995 111 5678 సంప్రదించాలని కోరారు.

రూ. 5.99 కోట్ల విలువైన సిగరెట్లు ధ్వంసం
సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి వెల్లడి



లక్ష్మీపురం: నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తుండగా పట్టుబడి, పన్ను చెల్లించని రూ.5.99 కోట్ల విలువ చేసే నకిలీ బ్రాండెడ్ సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు ధ్వంసం చేసినట్లు సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వద్ద జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌లో స్వాధీనం చేసుకున్న సిగరెట్లను అన్ని అనుమతులతో సీజీఎస్టీ అధికారులు శుక్రవారం పూర్తిగా ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్వంసం చేసిన సిగరెట్లు నాసిరకం, నకిలీ ఉత్పత్తులుగా నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. వీటిని మార్కెట్‌లో విక్రయించడం చట్ట రీత్యా నేరమని వెల్లడించారు. ప్రజారోగ్యాన్ని హాని కలిగించే సిగరెట్లు అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి సరైన పన్నులు చెల్లించకుండా అక్రమంగా రవాణా చేస్తున్న సిగరెట్లు ప్రజారోగ్యానికి కూడా ఎంతో హానికరంగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈనేపథ్యంలో సిగరెట్ల అక్రమ రవాణాపై గుంటూరు సీజీఎస్టీ కమిషనర్ పరిధిలోని పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈక్రమంలో విజయవాడలో పట్టుకున్న రూ.1.11 కోట్ల విలువైన సిగరెట్లతోపాటు, మొత్తం రూ.5.99 కోట్ల విలువైన 1.14 కోట్ల సిగరెట్ల స్టిక్‌లను ధ్వంసం చేశామని తెలిపారు. ఇలాంటి పన్నులు చెల్లించని చౌకబారు సిగరెట్లు పలు అక్రమంగా మన రాష్ట్రంలోకి వస్తున్నాయని, వీటిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.403 కోట్ల విలువైన పన్ను ఎగవేతను గుర్తించి, రూ.270 కోట్లు వసూలు చేశామని తెలిపారు. సిగరెట్ల ధ్వంసంలో కమిషనర్‌తోపాటు, జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్, సూపరింటెండెంట్లు ఆర్.పి.సి.కుమార్, గాదె శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే సీఎం జగన్‌కు శ్రీరామరక్ష

- వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి
- పలువురు టీడీపీ నాయకుల చేరిక

భట్టిప్రోలు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమాభివృద్ధి పథకాలే ఆయనను మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేస్తాయని వైఎస్సార్ సీపీ వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో రోజురోజుకూ టీడీపీ నుంచి తమ పార్టీలో పెరుగుతున్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన కొమ్ము రూపారావు, కారుమూరు చెంచయ్య, చుండూరు మండలం చిన గాదెలవర్రు నుంచి టీడీపీ సీనియర్ నాయకులు వెల్లంపల్లి కృష్ణకాంత్‌తో పాటు మరో నాలుగు కుటుంబాల ప్రతినిధులు శుక్రవారం టీడీపీకి గుడ్ బై చెప్పారు. వైఎస్సార్ సీపీలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరరావు, సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ–ప్రతాప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొండా శివప్రసాద్ రెడ్డి (ఎస్పీ రెడ్డి), సర్పంచులు తాడిశెట్టి శ్రీనివాసరరావు, వుయ్యూరు అప్పిరెడ్డి, సమక్షంలో చేరారు. వీరికి అశోక్ బాబు పార్టీ కండువాలతో సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసేందుకు కృషి చేస్తామన్నారు. పల్లెకోనలో పార్టీని బలోపేతం



పల్లెకోనకు చెందిన టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి



పార్టీలోకి చినగాదెలవర్రు టీడీపీ నాయకులను ఆహ్వానిస్తున్న వరికూటి

చేస్తామని అశోక్ బాబుకు హామీ ఇచ్చారు. పార్టీ రహితంగా ప్రజలకు అందిన సంక్షేమం, లబ్ధిని వివరించి పార్టీ విజయానికి పాటుపడాలని అశోక్ బాబు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మరియదాసు, కోటేశ్వరరావు, పోలూరి ప్రసాద్ రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేశ్
- నగరంలో పార్టీ కార్యాలయం ప్రారంభం

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ఈ ఎన్నికల్లో విజయానికి పత్రారాస్త్రాలని రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేశ్ అన్నారు. నగరంలో శుక్రవారం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఈవూరి మాట్లాడుతూ..నవరత్నాలతో ప్రతి కుటుంబం లబ్ధిపొందందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి ముంగిటకు చేరాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు..ఎలాగోలా అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు మోసపూరితమైన హామీలతో టీడీపీ కూటమి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు జాలాది మునియ్య, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రేపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేశ్

వైఎస్సార్ సీపీలోకి 55 టీడీపీ కుటుంబాలు

ఆహ్వానించిన మాజీ ఎంపీ మోదుగుల, అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్

చీరాల: పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేశ్ సూచించారు. శుక్రవారం వేటపాలెం మడలంలోని కొత్తపేట మేజర్ పంచాయతీ వడ్డెర సంఘం, గోపాల్ నగర్‌కు చెందిన 55 టీడీపీ, ఇతర పార్టీల కుటుంబాల ప్రతినిధులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేశ్ , ఎంపీగా నందిగం సురేశ్ ను ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని వారు కోరారు. కరణం వెంకటేశ్ కు సంపూర్ణ మద్దతు అందించి స్టార్ కాంపెయినర్లుగా వ్యవహరిస్తామని పార్టీలో చేరినవారు మాటిచ్చారు. పార్టీలో చేరిన వారిలో రవి, హనుమంతరావు, శ్రీను, పోలయ్య, రవీంద్ర, రోహన్‌సాయి, సన్నీ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్ , మాజీ ఎంపీ వేణు గోపాల్‌రెడ్డి సమక్షంలో చేరిన నాయకులు

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) గురువారం ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థి అన్నా సాయి వెంకట ధీరజ్ అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీమేధ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ డిసెంబర్–2023 సీఎంఏ ఫౌండేషన్ ర్యాంకుల జాబితాలో తమ విద్యార్థి 340 మార్కులతో ఆలిండియా టాపర్‌గా నిలిచాడని వివరించారు. తమ సంస్థ అందిస్తున్న ఇంటర్ ఎంఈసీ కాయిన్ ప్రోగ్రాం ద్వారా ఏక కాలంలో సీఏ, సీఎంఏ ఫౌండేషన్ శిక్షణ పొందిన సాయి వెంకట ధీరజ్ సీనియర్ ఇంటర్‌లో 979 మార్కులతో రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. ఈసందర్భంగా అన్నా నందకిషోర్, డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి విద్యార్థికి జ్ఞాపిక బహుకరించి, అభినందించారు.



సాయి వెంకట ధీరజ్‌ను అభినందిస్తున్న నందకిషోర్, శ్రీలక్ష్మి